STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 122 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 15 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |


హామీ ఇస్తేనే హసీనాను పంపిస్తాం



- బంగ్లాదేశ్‌కు భారత్ రెండు కీలక షరతులు!
- మరణశిక్షపై అప్పీల్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్

4

కశ్మీర్‌లో హత్యల వెనుక కుట్ర?



- మసీదు నుంచి బెదిరింపులంటూ బీజేపీ ఎమ్మెల్యే ఆరోపణలు!
- కిష్ట్వార్‌లో ఇద్దరు ప్రత్యేక పోలీసు అధికారుల హత్య కలకలం

2

మోదీ స్వయంగా ఫోన్లు ట్యాప్ చేయరు



- రాహుల్‌కు భిన్నంగా పిట్రోడా వ్యాఖ్యలు!
- ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు
- తన ఫోన్, ల్యాప్‌టాప్‌పైనా నిఘా ఉందన్న సామ్ పిట్రోడా

4



- అవసరమైతే అదనపు పోలీసు బలగాల తరలింపు
- నవంబర్ 23న పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాల ఏర్పాటు
- మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ
- నామినేషన్ల స్వీకరణకు తిరుపతిలో ప్రత్యేక కేంద్రాలు
- ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

స్థానిక ఎన్నికలకు.. పక్కా భద్రత!

పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘా

రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలను ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పకడ్బందీగా సన్నాహాలు పూర్తి చేసింది. గత నాలుగు, ఐదు నెలలుగా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో పలుమార్లు సమీక్షలు జరిపిన ఎన్నికల సంఘం.. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సమగ్ర కార్యాచరణను ఖరారు చేసింది. ముఖ్యంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశమున్న సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించేందుకు సిద్ధమైంది. అభ్యర్థులు, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఉండేలా ప్రతి నామినేషన్ కేంద్రం, పోలింగ్ బూత్, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీతో అడుగడుగునా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

2

-తిరుపతి, నవంబర్ 14 (సమయం న్యూస్) :



మురుసు నష్టంపై.. కేంద్ర బృందం ఆరా!

పల్లవరం కెనాల్, బొల్లాల చెరువు ప్రాంతాల పరిశీలన

వాస్తవ పరిస్థితులను వివరించిన స్థానిక అధికారులు

- గోపాలపురం మండలంలో దెబ్బతిన్న చెరువులు, కాలువలు
- పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని సూచన

వివరాలు 2లో..


ఏమాత్రం.. తేలిగ్గా తీసుకోవద్దు!

ఎట్టి పరిస్థితుల్లోనూ నాయకులు గొడవలకు పోవద్దు

- విద్యావంతులు, యువతను బాగా ప్రోత్సహించాలి
- స్థానిక సంస్థల్లో చారిత్రక విజయం కూటమిదే
- రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడే బలమైన నాయకత్వం

పేజీలు 2లో

పంచాయతీ ఎన్నికలపై నేతలకు సీఎం దిశానిర్దేశం



ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈవీఎంలైనా, బ్యాలెట్ అయినా చివరకు పోస్టల్ బ్యాలెట్లయినా ప్రజలు కూటమికే బ్రహ్మరథం పట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఓటు బ్యాంకు ఏకంగా 25 శాతం పెరిగిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాయకులు గొడవలకు పోయి చెడ్డ పేరు తెచ్చుకోవద్దని ఆయన పార్టీ ముఖ్య నేతలకు హెచ్చరికలు జారీ చేశారు.

-అమరావతి, నవంబర్ 15 (సమయం న్యూస్) :

సీఎం కాన్వాయ్‌లోకి.. కొత్త వాహనాలు!

- రూ.1.78 కోట్లు మంజూరు చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు

2

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భద్రతా విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం సెక్యూరిటీ కాన్వాయ్ అవసరాల కోసం కొత్తగా ఆరు అత్యాధునిక 'ఫోర్స్ అర్బానియా' వాహనాలను కొనుగోలు చేయాలని నిర్ణయించింది.



చుక్కలు చూపిస్తాం!

- మాజీ మంత్రి బొత్స ఫైర్

3

విజయనగరం జిల్లాలో నిర్వహించిన వైసీపీ సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో కక్షపూరిత రాజకీయాలు చేసే వారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని, వాళ్లకు కచ్చితంగా చుక్కలు చూపిస్తామని గట్టిగా హెచ్చరించారు.

నటుడు గిరిబాబు.. ఇక లేరు!

- అనారోగ్యంతో కన్నుమూసిన సీనియర్ నటుడు
- హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో తుదిశ్వాస
- ఆదివారం స్వగ్రామం రావినూతలలో అంత్యక్రియలు
- సంతాపం తెలిపిన చంద్రబాబు, పవన్, జగన్
- గిరిబాబు మృతిపై బాలకృష్ణ, చిరంజీవి దిగ్భ్రాంతి
- ఫిల్మ్ ఛాంబర్‌లో నివాళులర్పించిన ప్రముఖులు

3

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఐదు దశాబ్దాల పాటు తనదైన నటనతో చెరగని ముద్ర వేసిన ప్రముఖ నటుడు, దర్శక నిర్మాత గిరిబాబు (80) కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో వెండితెరపై తీవ్ర విషాదం నెలకొనగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా రాజకీయ, సినీ అగ్రగణ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లాలోని ఆయన స్వగ్రామం రావినూతలలో ఆదివారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.



మా సహనాన్ని.. పరీక్షించొద్దు!

- వైయస్ జగన్ కుటుంబ సభ్యులపై బూతులు
- డీజీపీ ఆఫీసులో వైయస్సార్సీపీ నేతల ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

3

వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా (ఎక్స్ స్పేస్) వేదికగా జనసేన కార్యకర్తలు చేసిన అత్యంత అసభ్యకర, జుగుప్సాకర వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్సీపీ సీనియర్ నాయకుల బృందం మంగళగిరిలోని రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఏమాత్రం.. తేలిగ్గా తీసుకోవద్దు!

పంచాయతీ ఎన్నికలపై నేతలకు సీఎం దిశానిర్దేశం

విద్యావంతులు, యువతను బాగా ప్రోత్సహించాలి

స్థానిక సంస్థల్లో చారిత్రక విజయం కూటమిదే

రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడే బలమైన నాయకత్వం

ఎట్టి పరిస్థితుల్లోనూ నాయకులు గొడవలకు పోవద్దు

అమరావతి, నవంబర్ 14 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి చారిత్రక విజయాన్ని అందించారని, ఈవీఎంలు అయినా, బ్యాలెట్ పేపర్లు అయినా, చివరకు పోస్టల్ బ్యాలెట్లలోనైనా ప్రజలు కూటమికే సంపూర్ణ మద్దతు పలికారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 94 మున్సిపాలిటీల్లో, 3,235 వార్డుల్లో ఎన్డీఏ అభ్యర్థులు ఘన విజయం సాధించారని, 575 జడ్పీటీసీ, 7,500 కంటే ఎక్కువ ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్లే గతంతో పోలిస్తే కూటమికి ఓటు బ్యాంకు ఏకంగా 25 శాతం పెరిగిందని వివరించారు. సుమారు ఏడు జిల్లాల్లో కూటమి క్లీన్ స్వీప్ చేసిందని, అనకాపల్లి, మార్కాపురం జిల్లాల ప్రజలు వంద శాతం స్ట్రైక్ రేట్ ఇచ్చారని గుర్తుచేశారు. పోలవరం ఎడమ కాల్వ, మార్కాపురం కొత్త జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1 ఫలాలు ఈ ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబించాయని విశ్లేషించారు. వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికలు తేలిగ్గా తీసుకోవద్దు..

రాబోయే రోజుల్లో జరగనున్న మరో 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను కూడా ఏమాత్రం తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో కూటమి బలపరిచే అభ్యర్థులే గెలవాలని, ప్రజల ఆదరణ ఉన్న మంచి వ్యక్తులను, విద్యావంతులను, యువతను ప్రోత్సహించాలని సూచించారు. కొందరు కావాలనే హింసను నమ్ముకుంటారని, కానీ కూటమి పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని మాత్రమే నమ్ముతుందని చెప్పారు. నాయకులెవరూ ఎట్టి పరిస్థితుల్లోనూ గొడవలకు పోవద్దని, చెడ్డ పేరు తెచ్చుకోవద్దని గట్టిగా హెచ్చరించారు. అధికారాన్ని కేవలం ప్రజలకు మంచి చేయడానికే ఉపయోగించుకోవాలని, గెలిచిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సీఎం హితవు పలికారు.

సీఎం కాన్వాయ్‌లోకి.. కొత్త వాహనాలు!

సీఎం భద్రతను మరింత బలోపేతం చేసిన ప్రభుత్వం

కాన్వాయ్ కోసం ఆరు కొత్త వాహనాల కొనుగోలు

రూ.1.78 కోట్లు మంజూరు చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు

అత్యాధునిక ఫీచర్లున్న 'ఫోర్స్ అర్బానియా' ఎంపిక

జెమ్ పోర్టల్ ద్వారా పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ



అమరావతి, నవంబర్ 14 (సమయం న్యూస్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భద్రతా విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం సెక్యూరిటీ కాన్వాయ్ అవసరాల కోసం కొత్తగా ఆరు అత్యాధునిక 'ఫోర్స్ అర్బానియా' వాహనాలను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సుమారు రూ. 1.78 కోట్ల నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర హోంశాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 'జెమ్' (గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్) పోర్టల్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఈ కొనుగోలు ప్రక్రియను త్వరలోనే పూర్తి చేయాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సీఎం కాన్వాయ్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించే భద్రతా సిబ్బంది ప్రయాణం మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉండేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆధునిక హంగులు, విశాలమైన స్థలంతో పాటు అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించేందుకు అనువైన సాంకేతిక ఫీచర్లు ఈ వాహనాల్లో ఉన్నాయి. ఈ కొత్త వాహనాల చేరికతో భద్రతా సిబ్బంది రాకపోకలు వేగవంతం కావడంతో పాటు సీఎం కాన్వాయ్ సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

స్థానిక ఎన్నికలకు.. పక్కా భద్రత!

- పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘా
- అవసరమైతే అదనపు పోలీసు బలగాల తరలింపు
- నవంబర్ 23న పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాల ఏర్పాటు
- మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ
- నామినేషన్ల స్వీకరణకు తిరుపతిలో ప్రత్యేక కేంద్రాలు
- ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా



తిరుపతి, నవంబర్ 14 (సమయం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లన్నీ పటిష్టంగా చేపట్టామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. శనివారం తిరుపతిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఐజీపీ రాజకుమారి, ఎన్నికల పరిశీలకులు ఎం. వరప్రసాద్ తదితర అధికారులతో నిర్వహించిన సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు గత నాలుగు ఐదు నెలలుగా ప్రణాళికాబద్ధంగా సన్నాహాలు చేస్తున్నామని, పంచాయతీరాజ్, మున్సిపల్ ఉన్నతాధికారులు, కలెక్టర్లు, ఎస్పీలు, జెడ్పీ సీఈవోలు, డీపీవోలతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ఖరారు చేసి అధికారులకు అందజేశామని, సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించినట్లు తెలిపారు. తొలి విడతలో 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 1న ఎన్నికలు నిర్వహించి, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించినట్లు వెల్లడించారు. ఆయా స్థానిక సంస్థల్లో డిప్యూటీ మేయర్, డిప్యూటీ చైర్మన్ ఎన్నికల ప్రక్రియను నవంబర్ 23వ తేదీకి ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించి, నవంబర్ 7న ఫలితాలు ప్రకటించినట్లు తెలిపారు. ఎంపీపీ ఎన్నికలు నవంబర్ 19న, జడ్పీ చైర్మన్ ఎన్నికలు నవంబర్ 20న నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. మొదటి విడతలో ఎన్నికలు పూర్తయిన 100 పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాల ఏర్పాటు నవంబర్ 23న జరగనుందని, ఆరోజు ప్రమాణ స్వీకారం చేసిన తేదీ నుంచి వారి ఐదేళ్ల పదవీకాలం ప్రారంభమవుతుందని వివరించారు. మిగిలిన 23 స్థానిక సంస్థలకు (నాలుగు కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు) సంబంధించి నవంబర్ 12న నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు.

వీడియోగ్రఫీతో నిఘా..

గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామని, మొదటి విడత ఎన్నికలకు నవంబర్ 13న, రెండో విడత నోటిఫికేషన్ నవంబర్ 16న విడుదల చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. శాంతిభద్రతలకు సంబంధించి సమస్యలు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అదనపు డీజీపీ మధుసూదన్ రెడ్డి, ఐజీపీ రాజకుమారి, డీఐజీలు, ఎస్పీలతో భద్రతా చర్యలపై ప్రత్యేకంగా చర్చించినట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత మున్సిపల్ ఎన్నికల పోలింగ్ శాతం 63 కాగా.. ప్రస్తుతం నిర్వహించిన ఎన్నికల్లో 62 శాతం నమోదైందని, అలాగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ గతంలో 60 శాతం కాగా ప్రస్తుతం 70 శాతం నమోదైందని ఆయన వెల్లడించారు. 12 జిల్లాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు తిరుపతి జిల్లాలో కేంద్రాలను ఏర్పాటు చేశామని, శ్రీకాళహస్తిలో రెండు కేంద్రాలతో పాటు మున్సిపల్, ఆర్డీవో కార్యాలయాల్లో ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం నుంచి అదనపు పోలీసు బలగాలను పంపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి నామినేషన్ కేంద్రం, పోలింగ్ స్టేషన్, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాల నిఘాతో పాటు వీడియోగ్రఫీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించి అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు కమిషనర్ స్పష్టం చేశారు.

మురుసు నష్టంపై కేంద్ర బృందం ఆరా!

- గోపాలపురం మండలంలో దెబ్బతిన్న చెరువులు, కాలువలు
- పల్లవరం కెనాల్, బొల్లాల చెరువు ప్రాంతాల పరిశీలన
- వరద ఉద్ధృతికి కోతకు గురైన కట్టలు, వంతెనలు
- వాస్తవ పరిస్థితులను వివరించిన స్థానిక అధికారులు
- శాశ్వత పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని సూచన



గోపాలపురం, నవంబర్ 14 (సమయం న్యూస్): మురుసు తుఫాను ప్రభావంతో గోదావరి జిల్లాలో సంభవించిన నష్టాలను క్షేత్రస్థాయిలో అంచనా వేసేందుకు జిల్లాలో పర్యటిస్తున్న అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందం శనివారం గోపాలపురం మండలంలోని పల్లవరం రైట్ మెయిన్ కెనాల్, బొల్లాల చెరువు ప్రాంతాలను సందర్శించి నష్టాలను నిశితంగా పరిశీలించింది. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురవడం, దానికితోడు ఎగువ ప్రాంతాల్లోని చిన్న నీటిపారుదల చెరువుల నుంచి భారీగా వరద నీరు ప్రవహించడంతో కాలువలు, చెరువుల పరిసర ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయని, కొన్ని ప్రాంతాల్లో చెరువు కట్టలు, వంతెనలు కోతకు గురై తీవ్రంగా దెబ్బతిన్నాయని అధికారులు బృందానికి వివరించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు చూపించిన నష్టపోయిన ప్రాంతాలను బృంద సభ్యులు స్వయంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. సుమారు 48 గంటల పాటు నిరంతరంగా వరద నీరు ప్రవహించడం, కేవలం మూడు గంటల వ్యవధిలోనే సుమారు 30 సెంటీమీటర్ల మేర అత్యధిక వర్షపాతం నమోదవడం వల్లే తీవ్ర స్థాయిలో వరద ఉద్ధృతి ఏర్పడినట్లు అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. ఎగువ ప్రాంతాల్లోని చిన్న నీటిపారుదల చెరువుల నుంచి వచ్చిన వరద ప్రవాహం కారణంగానే ఒక్కసారిగా నీటి మట్టం పెరిగి చెరువు కట్టలు, కాలువలు దెబ్బతిన్నాయని తెలిపారు.

శాశ్వత ప్రాతిపదికన ప్రతిపాదనలు..

అలాగే వరద ఉద్ధృతికి పూర్తిగా దెబ్బతిన్న వంతెనలను సైతం కేంద్ర బృందం పరిశీలించింది. తాత్కాలిక మరమ్మతులకు సుమారు రూ. 30 లక్షలు అవసరమవుతాయని, అదే శాశ్వత పునర్నిర్మాణానికి సుమారు రూ. 1.50 కోట్ల వ్యయం అయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు. పరిసర ప్రాంతాల్లో మరో రెండు వంతెనలు కూడా దెబ్బతిన్నాయని తెలియజేయగా.. అన్ని వంతెనలకు సంబంధించిన నష్టాలను సమగ్రంగా అంచనా వేసి ఆ అంచనాలను, మెమోరాండంలో పొందుపరచాలని కేంద్ర బృందం సూచించింది. శాశ్వత మరమ్మతులు, పునర్నిర్మాణానికి సంబంధించి పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, సమగ్ర ప్రతిపాదనలు అందించాలని స్పష్టం చేసింది. ఈ కేంద్ర బృందంలో న్యూఢిల్లీ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ అలోక్ జవహర్, హైదరాబాద్ ఇస్రో జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ) శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వి.ఎస్.పి. శర్మ, హైదరాబాద్ కేంద్ర జల సంఘం సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీమతి రాఖా రాణి కొల్లు, విజయవాడ కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కార్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శశాంక్ శేఖర్ రాజ్ సభ్యులుగా ఉన్నారు. వీరితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రాష్ట్ర లైజన్ అధికారి శ్రీమతి కౌసర్ బానో పర్యటించారు. ఈ పర్యటనలో ఆర్డీవో కె. ఆనందరావు, వ్యవసాయ అధికారి బి. వెంకటేశ్వరరావు, ఉద్యానవన శాఖ అధికారి ఎన్. మల్లికార్జునరావు, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ. దుర్గేష్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అతివేగం బలితీసుకుంది!

ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన మంత్రి అనిత

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

- అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు
- అనకాపల్లి జిల్లా కొత్త పోలవరం వద్ద ఘోర ప్రమాదం
- గుర్రంపేట గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల మృతి
- తీవ్రంగా గాయపడ్డ మరో నలుగురు.. విశాఖకు తరలింపు

అనకాపల్లి, నవంబర్ 14 (సమయం న్యూస్): అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరం మండలంలో శనివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కొత్త పోలవరం గ్రామం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల సమాచారం ప్రకారం.. ఎస్. రాయవరం మండలం గుర్రంపేట గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు కారులో పోలవరం వెళ్లి, సరదాగా గడిపి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో కొత్త పోలవరం వద్ద వారి కారు అతివేగం కారణంగా అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో కురందాసు శ్రీను, కోర్ని శ్రీను అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ఉన్న కురందాసు ప్రసాద్, బొట్టా సురేంద్ర, కురందాసు శివ, కురందాసు అశోక్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో నలుగురినీ అత్యవసర చికిత్స కోసం వెంటనే విశాఖపట్నంలోని ఆసుపత్రికి తరలించారు.



మెరుగైన వైద్యం అందించాలి..

ప్రమాద విషయం తెలుసుకున్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వెంటనే విశాఖపట్నంలోని ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎలాంటి లోటు లేకుండా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం కొత్త పోలవరం వెళ్లి ప్రమాదం జరిగిన ఘటనా స్థలాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. ఆ తర్వాత నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి అనిత ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

సీనియర్ నటుడు గిరిబాబు.. ఇక లేరు!

- అనారోగ్యంతో కన్నుమూసిన సీనియర్ నటుడు
- హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో తుదిశ్వాస
- ఆదివారం స్వగ్రామం రావినూతలలో అంత్యక్రియలు
- సంతాపం తెలిపిన చంద్రబాబు, పవన్, జగన్
- గిరిబాబు మృతిపై బాలకృష్ణ, చిరంజీవి దిగ్భ్రాంతి
- ఫిల్మ్ ఛాంబర్‌లో నివాళులర్పించిన ప్రముఖులు



హైదరాబాద్, నవంబర్ 14 (సమయం న్యూస్): టాలీవుడ్ సీనియర్ నటుడు గిరిబాబు (80) తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ కొండాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. తన తండ్రి మరణ వార్తను ఆయన కుమారుడు, నటుడు రఘుబాబు కన్నీరుమున్నీరుగా మీడియాకు వెల్లడించారు. తన తండ్రి గత మూడేళ్లుగా అల్జీమర్స్, పార్కిన్సన్స్, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడ్డారని, ఆరు నెలలుగా పూర్తిగా మంచానికే పరిమితమయ్యారని తెలిపారు. శనివారం మధ్యాహ్నం బీపీ, షుగర్ లెవల్స్ పూర్తిగా పడిపోయి 3 గంటల సమయంలో మరణించారని చెప్పారు. ప్రకాశం జిల్లాలో ఒక సామాన్య వ్యవసాయ కుటుంబంలో జన్మించిన గిరిబాబు.. 1973 నుంచి 2022 వరకు దాదాపు 47 ఏళ్ల పాటు ఇండస్ట్రీలో కొనసాగారని, 650కి పైగా చిత్రాల్లో నటించారని గుర్తుచేశారు. ఇండస్ట్రీకి వచ్చిన మూడేళ్లకే నిర్మాణ సంస్థను స్థాపించి ఎన్నో భారీ బడ్జెట్ చిత్రాలు నిర్మించారని రఘుబాబు వివరించారు. అభిమానులు, సినీ ప్రముఖుల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్ ప్రాంగణంలో ఉంచారు. నటులు తనికెళ్ల భరణి, రావు రమేశ్, శివాజీ రాజా, సీనియర్ నటి అన్నపూర్ణమ్మ తదితరులు ఫిల్మ్ ఛాంబర్‌కు చేరుకుని నివాళులర్పించారు. గిరిబాబు అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఆయన స్వగ్రామమైన ప్రకాశం జిల్లా మేదరమెట్ల సమీపంలోని రావినూతలలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రముఖుల ప్రగాఢ సంతాపం..

గిరిబాబు మరణవార్త పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధినేత వైఎస్ జగన్, మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ తదితర ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విలన్‌గా, హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఐదు దశాబ్దాల పాటు ప్రేక్షకులను మెప్పించిన గిరిబాబు మరణం విచారకరమని సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. దర్శకుడిగా, నిర్మాతగా కూడా ఆయన ఎన్నో విజయవంతమైన చిత్రాలు తీశారని పవన్, లోకేశ్ కొనియాడారు. వైఎస్సార్‌కు ఆయన మంచి స్నేహితుడని, వైసీపీలో క్రియాశీలక సభ్యుడని వైఎస్ జగన్ గుర్తుచేసుకున్నారు. 'అన్నదమ్ముల అనుబంధం' నుంచి ఎన్నో సినిమాల్లో ఆయనతో కలిసి నటించిన క్షణాలను నందమూరి బాలకృష్ణ నెమరువేసుకున్నారు. వెండితెరపై విభిన్న పాత్రలు పోషించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని మెగాస్టార్ చిరంజీవి కీర్తించారు. గిరిబాబు మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని పేర్కొంటూ ఆయన కుటుంబ సభ్యులకు అందరూ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మా సహనాన్ని పరీక్షించొద్దు!

- డీజీపీ ఆఫీసులో వైయస్సార్సీపీ నేతల ఫిర్యాదు
- జనసేన మూక అరాచకాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఎక్స్ స్పేస్‌లో వైయస్ జగన్ కుటుంబ సభ్యులపై బూతులు
- సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి దీనిపై మౌనమెందుకు?
- అర్ధరాత్రి కూడా మా వాళ్లపై కేసులు పెడుతున్న పోలీసులు
- సెలవుల సాకుతో ఫిర్యాదు తీసుకునేందుకు డీజీపీ నిరాకరణ



మంగళగిరి, నవంబర్ 14 (సమయం న్యూస్): వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా (ఎక్స్ స్పేస్) వేదికగా జనసేన కార్యకర్తలు చేసిన అత్యంత అసభ్యకర, జుగుప్సాకర వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్సీపీ సీనియర్ నాయకుల బృందం మంగళగిరిలోని రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసి 60 గంటలు గడుస్తున్నా ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీజీపీ అందుబాటులో లేకపోవడంతో అక్కడి అధికారులకు పెన్ డ్రైవ్‌తో కూడిన ఆధారాలను అందజేసి, అనంతరం మీడియాతో మాట్లాడారు. డీజీపీ ఆఫీసుకు ఫిర్యాదు చేయడానికి వస్తే సెలవుల సాకుతో తప్పించుకుంటున్నారని, అదే వైయస్సార్సీపీ కార్యకర్తలపై మాత్రం అర్ధరాత్రి కూడా తప్పుడు కేసులు పెడుతున్నారని వారు మండిపడ్డారు. జనసేన సైకోలు సోషల్ మీడియాలో మహిళలను కించపరుస్తూ బూతులు మాట్లాడితే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనిత మౌనంగా ఎందుకు ఉన్నారని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ నిలదీశారు.

సంయమనం పాటిస్తుంటే.. రెచ్చిపోతున్నారు..

పవన్ కళ్యాణ్ వ్యక్తిగత విషయాలపై మాట్లాడవద్దని జగన్ ఆదేశిస్తే మేమంతా సంయమనం పాటించామని, కానీ మా సంయమనాన్ని చేతగానితనంగా భావించి మీ పార్టీ సైకోలు బూతులతో రెచ్చిపోతున్నారని నేతలు హెచ్చరించారు. ఏనాడూ రాజకీయాల్లోకి రాని భారతమ్మపై 350 మందితో కూడిన ఎక్స్ స్పేస్‌లో జనసైకోలు అత్యంత నీచంగా మాట్లాడారని, సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఆ వీడియోలను ఎవరూ చూడలేని పరిస్థితి ఉందన్నారు. మహిళలను గౌరవిస్తామని గొప్పలు చెప్పుకునే కూటమి నేతలు.. పవన్ కళ్యాణ్ మూడో విడాకుల అంశంపై ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని వారు సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైయస్సార్సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అసభ్య వ్యాఖ్యలపై వెంటనే చర్యలు తీసుకోకపోతే న్యాయపోరాటం చేస్తామని, అప్పటివరకు న్యాయపరంగా పోరాడుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

తప్పిన.. పెను ప్రమాదం!

- గాజువాక సెలెస్ట్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం
- 'ఏ' టవర్ గ్రౌండ్ ఫ్లోర్‌లో చెలరేగిన మంటలు
- ప్రాణభయంతో బయటకు పరుగులు తీసిన జనం
- అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న 600 కుటుంబాలు
- సకాలంలో స్పందించి మంటలార్పిన ఫైర్ సిబ్బంది
- ఎవరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా సేఫ్



విశాఖపట్నం, నవంబర్ 14 (సమయం న్యూస్): విశాఖపట్నం గాజువాకలోని సెలెస్ట్ మల్టీప్లెక్స్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. కాంప్లెక్స్‌లోని 'ఏ' టవర్ గ్రౌండ్ ఫ్లోర్‌లో నిల్వ ఉంచిన ప్యాకింగ్ అట్టలకు అకస్మాత్తుగా నిప్పు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ కమ్ముకోవడంతో భవనం లోపల ఉన్న వారు ఏం జరుగుతుందో అర్థంకాక తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ సెలెస్ట్ అపార్ట్‌మెంట్ సముదాయంలో సుమారు 600 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు ఎగిసిపడి పొగ పై అంతస్తులకు వేగంగా వ్యాపించడంతో నివాసితులంతా ప్రాణభయంతో ఒక్కసారిగా కిందకు పరుగులు తీశారు. చిన్నారులు, వృద్ధులతో సహా వందలాది మంది ఒక్కసారిగా కిందకు దిగడంతో ఆవరణలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది.

హుటాహుటిన రంగంలోకి..

ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలు పైఅంతస్తులకు, ఇతర టవర్లకు వ్యాపించకుండా చాలా వేగంగా అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను పూర్తిగా ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులంతా ఊపిరి పీల్చుకున్నారు.

అప్పు కోసం.. పసికందు కిడ్నాప్!

- బకాయి తీర్చలేదని వడ్డీ వ్యాపారుల ఘాతుకం
- ఆరు నెలల చిన్నారిని ఎత్తుకెళ్లిన దుండగులు
- తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలో షాకింగ్ ఘటన
- పోలీసులను ఆశ్రయించిన బాధిత తల్లిదండ్రులు
- పాపను సురక్షితంగా రక్షించి అప్పగించిన పోలీసులు
- వడ్డీ వ్యాపారులపై మండిపడుతున్న స్థానికులు



తిరుపతి, నవంబర్ 14 (సమయం న్యూస్): తీసుకున్న అప్పు తీర్చలేదని వడ్డీ వ్యాపారులు ఏకంగా ఆరు నెలల పసికందును ఎత్తుకెళ్లిన దారుణమైన ఘటన తిరుపతి జిల్లాలో చోటుచేసుకుంది. తొట్టంబేడు మండలం శివనాథపాలెంలో నివాసం ఉంటున్న ఆది, మేఘమాల దంపతులు ఏడు నెలల క్రితం శ్రీకాళహస్తికి చెందిన వెంకటగిరి మునెమ్మ, ప్రసాద్, మోహన్ కుటుంబ సభ్యుల వద్ద ఐదు రూపాయల వడ్డీకి రూ. 1,50,000 అప్పుగా తీసుకున్నారు. అయితే తీసుకున్న అప్పు తిరిగి చెల్లించడంలో ఆలస్యం కావడంతో వడ్డీ వ్యాపారులు ఆ దంపతులతో గొడవకు దిగారు. అంతటితో ఆగకుండా అప్పు తీర్చలేదనే కారణంతో వారి ఇంట్లో నిద్రిస్తున్న ఆరు నెలల పసికందును బలవంతంగా ఎత్తుకుపోయారు. ఈ షాకింగ్ ఘటనతో తీవ్ర భయాందోళనలకు గురైన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా వెంటనే పోలీసులను ఆశ్రయించారు.

రంగంలోకి దిగిన పోలీసులు..

బాధితుల ఫిర్యాదుతో హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు నేరుగా అప్పు ఇచ్చిన వడ్డీ వ్యాపారుల ఇంటికి వెళ్లారు. అక్కడ నిర్బంధించి ఉన్న పసిపాపను సురక్షితంగా స్వాధీనం చేసుకుని తిరిగి ఆ చిన్నారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. దీంతో ఆ దంపతులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అప్పు ఇస్తే ఎవరైనా ఇంట్లోని వస్తువులను జప్తు చేస్తారు కానీ.. ఏకంగా ఆరు నెలల పసికందును ఎత్తుకుపోవడం ఏంటని స్థానికులు వడ్డీ వ్యాపారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన వారిపై వెంటనే కిడ్నాప్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



చుక్కలు చూపిస్తాం!

- కక్షపూరిత రాజకీయాలపై మాజీ మంత్రి బొత్స ఫైర్
- ప్రత్యర్థులపై ఇక సానుభూతి చూపించేదే లేదు
- అయ్యో పాపం అని వదిలేసే పరిస్థితులు ఉండవు
- నాయకులు, కార్యకర్తలు మైండ్ సెట్ మార్చుకోవాలి
- ఈ విషయాలన్నీ అధినేత జగన్ దృష్టికి తీసుకెళ్లా

విజయనగరం, నవంబర్ 14 (సమయం న్యూస్): విజయనగరం జిల్లాలో నిర్వహించిన వైసీపీ సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో కక్షపూరిత రాజకీయాలు చేసే వారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని, వాళ్లకు కచ్చితంగా చుక్కలు చూపిస్తామని గట్టిగా హెచ్చరించారు. గతంలో మాదిరిగా రాజకీయ ప్రత్యర్థులపై అనవసర సానుభూతి చూపిస్తూ 'అయ్యో పాపం' అని వదిలేసే పరిస్థితులు ఇకపై ఏమాత్రం ఉండబోవని ఆయన తేల్చిచెప్పారు. రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను గమనిస్తుంటే, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తమ ఆలోచనా విధానాన్ని (మైండ్ సెట్) మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఏర్పడుతోందని బొత్స అభిప్రాయపడ్డారు.

ఉపేక్షించే ప్రసక్తే లేదు..

అందరినీ సమానంగా చూసే రాజకీయాలు ప్రస్తుత వాతావరణంలో ఇకపై పని చేయవేమోనని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితులు, పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన వైఖరిపై తన మనసులోని అభిప్రాయాలను ఇప్పటికే పార్టీ అధినేత జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు బొత్స వెల్లడించారు. ప్రత్యర్థుల కక్షసాధింపు చర్యలను ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

అమరావతి రైల్వే.. రూట్ ఖరారు!

- రాజధానికి పటిష్ఠమైన రవాణా వ్యవస్థ
- తాడికొండ సమీపంలో ప్రధాన రైల్వే స్టేషన్
- కొప్పురావూరులో 230 ఎకరాల్లో మెగా టెర్మినల్
- గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం
- కృష్ణా నదిపై 4.5 కిలోమీటర్ల ఐకానిక్ వంతెన
- కొత్త మార్గంలో రానున్న తొమ్మిది స్టేషన్లు
- భూమి కేటాయించాలని సీఆర్డీఏను కోరిన రైల్వే



అమరావతి, నవంబర్ 14 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రైల్వే కనెక్టివిటీ కల్పించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. అమరావతి మీదుగా వెళ్లే రైల్వే లైన్ రూట్, రాజధాని ప్రధాన రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసే ప్రదేశం, భారీ టెర్మినల్ ప్రాంతాన్ని రైల్వే శాఖ దాదాపు ఖరారు చేసింది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా నంబూరు మధ్య నిర్మించనున్న ఈ కొత్త రైల్వే కారిడార్ పొడవును గతంలో ప్రతిపాదించిన 56.53 కిలోమీటర్ల నుంచి 58.1 కిలోమీటర్లకు సవరించారు. ఈ మార్గంలో గరిష్ఠంగా గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లు రాకపోకలు సాగించే విధంగా అత్యంత ఆధునిక సాంకేతికతతో ట్రాక్ నిర్మించనున్నారు. ఈ మార్గంలో కృష్ణా నదిపై సుమారు 4.5 కిలోమీటర్ల పొడవైన అద్భుతమైన ఐకానిక్ వంతెన ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వీటితో పాటు మొత్తం 32 భారీ వంతెనలు, 92 చిన్న వంతెనలు, రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా 12 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు.

కొప్పురావూరులో మెగా టెర్మినల్..

రాజధాని కోర్ క్యాపిటల్ ఏరియాలో భాగంగా, తాడికొండకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ప్రధాన అమరావతి రైల్వే స్టేషన్‌ను నిర్మించనున్నారు. దీనితో పాటు సుదూర ప్రాంతాల రైళ్ల నిర్వహణ కోసం కొప్పురావూరు వద్ద దాదాపు 230 ఎకరాల విస్తీర్ణంలో భారీ టెర్మినల్‌ను ప్రతిపాదించారు. 24 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు కలిగిన భారీ రైళ్లను సులభంగా హ్యాండిల్ చేసేలా దీనిని తీర్చిదిద్దనున్నారు. ఈ టెర్మినల్‌లో తొమ్మిది ప్రధాన ప్లాట్‌ఫామ్‌లు, ఆరు సైడ్ లైన్లు, రైళ్ల నిర్వహణకు అవసరమైన పిట్ లైన్లు, మరో 12 స్టీరింగ్ లైన్లు ఏర్పాటు కానున్నాయి. ఈ మెయింటెనెన్స్ హబ్ నిర్మాణం కోసం అవసరమైన భూమిని కేటాయించాలని రైల్వే శాఖ ఇప్పటికే ఏపీ సీఆర్డీఏను కోరింది. కాగా, ఈ కొత్త మార్గంలో పెద్దపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపల్లి, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరు మీదుగా తొమ్మిది స్టేషన్లు రానున్నాయి. వీటిలో పెద్దపురం, పరిటాల, అమరావతి, కొప్పురావూరు స్టేషన్లను క్రాసింగ్ స్టేషన్లుగా అభివృద్ధి చేయనున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎర్రుపాలెం, నంబూరు స్టేషన్లను కీలక రైల్వే జంక్షన్లుగా మార్చనున్నారు.



దేశంలో ఫోన్ ట్యాపింగ్ వాస్తవమే..

నా ఫోన్‌పైనా నిఘా పెట్టారు: ప్రశాంత్ కిశోర్

పెగాసస్ నిఘా జాబితాలో తన పేరు కూడా ఉందని వెల్లడించిన జన్‌సురాజ్ వ్యవస్థాపకుడు

పట్నా, నవంబర్ 14 (సమయం న్యూస్) దేశంలో ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్నదనేది అక్షరాలా వాస్తవమేనని జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, బిహార్ శాసనసభ్యుడు ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొన్నేళ్ల క్రితం దేశవ్యాప్తంగా కలకలం రేపిన 'పెగాసస్' స్పైవేర్ వివాదం వెలుగులోకి వచ్చిన సమయంలో తన ఫోన్‌పైనా నిఘా ఉంచారని ఆయన వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం పట్నాలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ప్రశాంత్ కిశోర్ ఈ మేరకు స్పందించారు. ప్రజలకు నిజాలు తెలియాలి:దేశంలో కొంతకాలంగా ఫోన్ల ట్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, ఈ నిఘా వ్యవహారం గురించి దేశ ప్రజలందరికీ కచ్చితంగా తెలియాలని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. "ఫోన్ల ట్యాపింగ్ అనేది దేశంలో ఒక వాస్తవం. ఇది కొంతకాలం నుంచి జరుగుతోంది. గతంలో పెగాసస్ దృష్టిసారించిన ప్రముఖుల జాబితాలో నా పేరు కూడా ఉన్నట్లు బయటపడిన తర్వాతే, నా ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైందనే విషయం నాకు తెలిసింది" అని ఆయన వివరించారు. సమ్రాట్ చౌధరీతో భేటీపై ఘాటు స్పందన:ఇదే సమయంలో, తాను నిత్యం తీవ్రస్థాయిలో విమర్శించే బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీతో ఇటీవల ఓ కార్యక్రమంలో కలవడంపై వస్తున్న ఊహాగానాలపైనా ప్రశాంత్ కిశోర్ స్పందించారు. ఒక శ్రాద్ధ కార్యక్రమానికి హాజరైనప్పుడు ఎదురుపడటంతో సామాజిక, రాజకీయ మర్యాద ప్రకారమే తాను ఆయనతో మాట్లాడానని స్పష్టం చేశారు. "కేవలం మర్యాదపూర్వకంగా భేటీ అయినంత మాత్రాన.. ఏడో తరగతి కూడా ఉత్తీర్ణుడు కాలేకపోయిన వ్యక్తిని పీహెచ్‌డీ చేసిన మేధావిగా పరిగణించినట్లు కాదు" అని ప్రశాంత్ కిశోర్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గతంలో తాను ఆయనపై చేసిన విమర్శలు, ఆరోపణల విషయంలో ఎలాంటి మార్పు లేదని, వ్యక్తిగత ద్వేషాలు లేకపోయినా బిహార్ అభివృద్ధి కోసం తన పోరాటం కొనసాగుతుందని ఆయన తేల్చిచెప్పారు.

కశ్మీర్‌లో పోలీసుల హత్యల వెనుక కుట్ర?

మసీదు నుంచి బెదిరింపులంటూ బీజేపీ ఎమ్మెల్యే ఆరోపణలు!

కిష్త్వార్‌లో ఇద్దరు ప్రత్యేక పోలీసు అధికారుల హత్య కలకలం

ఉగ్రవాదుల ఆచూకీకి రూ.30 లక్షల నజరానా ప్రకటన

కిష్త్వార్, నవంబర్ 14 (సమయం న్యూస్) జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో ఇద్దరు ప్రత్యేక పోలీసు అధికారులు (ఎస్‌పీఓలు) హత్యకు గురైన ఘటన రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ హత్యల వెనుక స్థానికంగా కుట్ర జరిగి ఉండవచ్చని బీజేపీ ఎమ్మెల్యే షుగన్ పరిహార్ అనుమానం వ్యక్తం చేశారు. మృతులకు గతంలో స్థానిక మసీదు నుంచి బెదిరింపులు వచ్చాయని ఆరోపించారు. అప్పట్లో ఆ బెదిరింపులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. హత్యకు గురైన పోలీసుల స్వగ్రామం కియార్‌ను ఎమ్మెల్యే షుగన్ పరిహార్, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ప్రతిపక్ష నేత సునీల్ శర్మ సందర్శించారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన అనంతరం పరిహార్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఉగ్రవాదులకు ఎవరైనా సమాచారం అందిస్తున్నారా అనే కోణంలోనూ దర్యాప్తు జరపాలని కోరారు. భద్రతా ఏర్పాట్లలో లోపాలు ఉన్నాయా, ఉన్నతాధికారుల స్థాయిలో నిర్లక్ష్యం జరిగిందా అనే అంశాలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. అయితే మసీదు నుంచి బెదిరింపులు వచ్చాయన్న ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ వెలువడలేదు. జమ్మూకశ్మీర్ పోలీసుల ప్రత్యేక ఆపరేషన్స్ బృందంలో పనిచేస్తున్న బాబీ చంద్ (57), రష్పాల్ కుమార్ (45) నవంబర్ 11న విధుల నిమిత్తం బయలుదేరి అదృశ్యమయ్యారు. మరుసటి రోజు అటవీ ప్రాంతంలో తూటా గాయాలతో వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. వారి వద్ద ఉన్న ఆయుధాలు కనిపించకపోవడంతో భద్రతా బలగాలు విస్తృత గాలింపు చేపట్టాయి. ఘటనా స్థలంలో పాకిస్తాన్‌లో తయారైనట్లు అనుమానిస్తున్న ప్రత్యేక తూటాలు లభ్యమైనట్లు సమాచారం. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించేందుకు భద్రతా బలగాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. ముగ్గురు అనుమానిత ఉగ్రవాదుల ఆచూకీ తెలిపిన వారికి రూ.30 లక్షల నజరానా ప్రకటించినట్లు సమాచారం. ఇద్దరు పోలీసుల హత్యలకు దారితీసిన పరిస్థితులు, బెదిరింపుల ఆరోపణలు, స్థానిక సహకారం తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.



మోదీ స్వయంగా ఫోన్లు ట్యాప్ చేయరు

- రాహుల్‌కు భిన్నంగా పిట్రోడా వ్యాఖ్యలు!
- ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు
- ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ సంచలన ఆరోపణలు
- తన ఫోన్, ల్యాప్‌టాప్‌పైనా నిఘా ఉందన్న సామ్ పిట్రోడా
- రాహుల్ ఆరోపణలను తోసిపుచ్చిన బీజేపీ నేతలు



న్యూఢిల్లీ, నవంబర్ 14 (సమయం న్యూస్) నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారంటూ రాహుల్ గాంధీ చేసిన సంచలన ఆరోపణలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. అయితే, రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు భిన్నంగా ఆ పార్టీ సీనియర్ నేత, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ సామ్ పిట్రోడా స్పందించడం ఆసక్తికరంగా మారింది. ప్రధాని మోదీ స్వయంగా ఫోన్లు ట్యాప్ చేయరని తాను భావిస్తున్నట్లు పిట్రోడా వ్యాఖ్యానించారు. ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై మీడియా అడిగిన ప్రశ్నకు సామ్ పిట్రోడా సమాధానమిస్తూ.. "ప్రధాని మోదీ అలా చేయరని నేను భావిస్తున్నాను. ఆయన స్వయంగా స్క్రూడ్రైవర్ పట్టుకుని కంప్యూటర్ దగ్గర కూర్చుని ఫోన్లు ట్యాప్ చేయరు" అని పేర్కొన్నారు. అయితే, ఇదే సమయంలో తన వ్యక్తిగత పరికరాల భద్రతపై ఆయన తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. తన ఫోన్ ట్యాప్ అవుతోందని, తన ల్యాప్‌టాప్, బ్యాంక్ అకౌంట్లపై నిఘా ఉందని అనుమానంగా ఉందని పిట్రోడా తెలిపారు. ఈ విషయాన్ని తాను టెక్ నిపుణులతో పరిశీలింపజేశానని, తన డివైజ్‌లపై నిఘా ఉండే అవకాశం ఉందని వారు కూడా హెచ్చరించినట్లు ఆయన వివరించారు. కాగా, తన ఫోన్‌ను ఎవరు ట్యాప్ చేస్తున్నారనే విషయంపై మాత్రం ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అంతకుముందు శుక్రవారం నాడు రాహుల్ గాంధీ ప్రధాని మోదీని ఉద్దేశించి తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాని తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని, దీనికి సంబంధించిన సమాచారం గురించి ఆయనకు ముందే తెలుసని రాహుల్ ఆరోపించారు. ప్రధాని తనతో ముఖాముఖి చర్చకు అంగీకరించిన రోజు.. విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరు ఉన్నారు? ఎవరు దేశ వ్యతిరేకి? ఎవరు దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు? అనే అసలు నిజాలన్నీ దేశ ప్రజలందరికీ తెలుస్తాయని రాహుల్ సవాల్ విసిరారు.

రాహుల్ ఆరోపణలను కొట్టిపారేసిన బీజేపీ

మరోవైపు, రాహుల్ గాంధీ చేసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతలు తీవ్రంగా ఖండించారు. కేవలం రాజకీయ ప్రాధాన్యం పొందేందుకే ఎలాంటి ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ అంశంపై బీజేపీ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఘాటుగా స్పందించారు. రాహుల్ గాంధీ ముందుగా తన మానసిక పరిస్థితిని పరీక్షించుకోవాలని ఎద్దేవా చేశారు. ఆయన ఫోన్ ట్యాప్ చేయడంపై ఎవరికీ ఏమాత్రం ఆసక్తి లేదని, కానీ ఆయన మెదడు రోజూ ఎందుకు అబద్ధాలు చెబుతుందో తెలుసుకోవాలనే ఆసక్తి మాత్రం ప్రజలకు ఉండొచ్చని రాజీవ్ చంద్రశేఖర్ విమర్శించారు.

హామీ ఇస్తేనే హసీనాను పంపిస్తాం

బంగ్లాదేశ్‌కు భారత్ రెండు కీలక షరతులు!

మరణశిక్షపై అప్పీల్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్



న్యూఢిల్లీ/ఢాకా, నవంబర్ 14 (సమయం న్యూస్) బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను స్వదేశానికి అప్పగించే విషయంలో భారత్ కీలక షరతులు విధించినట్లు తెలుస్తోంది. 2024 ఆగస్టులో జరిగిన హింసాత్మక ఆందోళనల అనంతరం పదవి కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న హసీనా.. వచ్చే నెల (డిసెంబర్)లో తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో అక్కడ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మానవత్వానికి వ్యతిరేక నేరాలకు పాల్పడ్డారన్న అభియోగాలపై బంగ్లాదేశ్ ప్రత్యేక ట్రైబ్యునల్ ఇప్పటికే ఆమెకు మరణశిక్ష విధించింది. ఈ క్రమంలో ఆమెను అప్పగించాలంటే తమకు స్పష్టమైన గ్యారెంటీ ఇవ్వాలని భారత్ బంగ్లాదేశ్ ప్రభుత్వం ముందు రెండు ప్రధాన షరతులను ఉంచినట్లు 'బీబీసీ బంగ్లా' కథనం వెల్లడించింది. షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు పంపించే విషయంలో న్యూఢిల్లీ స్పష్టమైన వైఖరితో ఉన్నట్లు సమాచారం. మొదటి షరతు ప్రకారం.. హసీనాను తిరిగి బంగ్లాదేశ్ తీసుకెళ్లే పూర్తి బాధ్యతను ఆ దేశ సైన్యమే తీసుకోవాలి. 2024 ఆగస్టు 5న ఆమె బంగ్లాదేశ్ సైనిక విమానంలో భారత్‌కు వచ్చిన తరహాలోనే, ఇప్పుడు కూడా విమాన మార్గంలో ఢిల్లీ నుంచి తీసుకెళ్లినా లేదా భూమార్గం ద్వారా సరిహద్దు దాటినా బంగ్లా సైన్యమే ఆమెను రిసీవ్ చేసుకోవాలని భారత్ కోరుతోంది. ఇందుకు అవసరమైన రవాణా, భద్రతా ఏర్పాట్లలో పూర్తి సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. ఇక రెండో షరతు ప్రకారం.. బంగ్లాదేశ్ కోర్టులు హసీనాకు విధించిన మరణశిక్షపై అప్పీల్ చేసుకునే చట్టబద్ధమైన అవకాశం కల్పించడంతో పాటు, ఈ కేసును నిష్పక్షపాతంగా పునర్విచారణ జరపాలని భారత్ స్పష్టం చేసింది. కేవలం ఉరితీయడానికి తెలిసి తెలిసి ఆమెను అప్పగించలేమని, న్యాయమైన విచారణకు అవకాశం లభించాలన్నదే తమ ఉద్దేశమని భారత విదేశాంగ శాఖ వర్గాలు పేర్కొన్నట్లు కథనం తెలిపింది. హసీనా తిరుగు ప్రయాణంపై భారత్, బంగ్లాదేశ్ మధ్య తెరవెనుక మంతనాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియలో ఇరు దేశాల సైనిక వ్యవస్థలు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఇందులో భాగంగానే అక్టోబర్ మొదటి వారంలో బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషనర్ దినేశ్ త్రివేది ఢిల్లీకి వచ్చి ప్రధాని మోదీతో పాటు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేత్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లే సమయంలో బంగ్లా సైన్యం చురుకైన పాత్ర పోషించేలా చూడటమే ఈ భేటీ వెనుక ప్రధాన ఉద్దేశమని భారత సైనిక వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, ప్రవాసంలో ఉన్న షేక్ హసీనా నవంబర్ 9న కొత్త పాస్‌పోర్ట్, జాతీయ గుర్తింపు కార్డు (ఎన్‌ఐడీ) కోసం ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. పదవి కోల్పోయిన తర్వాత ఆమె బంగ్లా ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడం ఇదే తొలిసారి. అయితే, ఆమె దరఖాస్తుపై ఢాకా నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. అప్పగింత ఒప్పందం కింద ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ నేతలు డిమాండ్ చేస్తుండగా, పాస్‌పోర్ట్ దరఖాస్తు ద్వారా హసీనా బంతిని బంగ్లా ప్రభుత్వం కోర్టులోకి నెట్టారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ ప్రెస్ సెక్రటరీ కేఎం నజ్ముల్ హక్ శుక్రవారం ఫేస్‌బుక్ వేదికగా స్పందిస్తూ.. బ్రిటన్, అమెరికా, యూఏఈ, సౌదీ అరేబియా, ఫిన్లాండ్, బెలారస్, ఖతార్ సహా ఆఫ్రికా దేశాల్లో ఏ ఒక్కటీ హసీనాకు ఆశ్రయం ఇవ్వడానికి ముందుకు రాలేదని ఆరోపించారు. అన్ని దారులు మూసుకుపోయిన తర్వాతే ఆమె గత్యంతరం లేక బంగ్లాదేశ్‌కు తిరిగి రావాలని చూస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రెస్‌మీట్‌లో ఒక వ్యక్తిని ముద్దుపెట్టుకున్న బీజేపీ ఎమ్మెల్యే

ఏఐ వీడియో అని ఆయన భార్య ఆరోపణ

భువనేశ్వర్: మీడియా సమావేశంలో మంత్రి ప్రసంగిస్తుండగా ఒక బీజేపీ ఎమ్మెల్యే తన పక్కన ఉన్న వ్యక్తిని ముద్దు పెట్టుకున్నారు. అతడిని కౌగిలించునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లుగా ఉన్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే అది ఏఐ వీడియో అని ఆ ఎమ్మెల్యే భార్య ఆరోపించారు. బీజేపీ పాలిత ఒడిశాలో ఈ సంఘటన జరిగింది. గురువారం గంజాం జిల్లాలో వరద ప్రభావంపై మత్స్య, పశు వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గోకులానంద మాలిక్ మీడియాతో మాట్లాడారు. 2024లో మొదటిసారి అసెంబ్లీకి ఎన్నికైన చికితీ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే మనోరంజన్ ద్యాన్ సమంత్రా, ఆ మంత్రి వెనుక నిల్చొని ఉన్నారు. అయితే పక్కనే ఉన్న వ్యక్తిని ముద్దు పెట్టుకోవడానికి, కౌగిలించుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నట్లుగా ఉన్న ఒక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కాగా, ఒడిశాలోని ప్రతిపక్ష బీజేడీ ఈ వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో షేర్ చేసింది. 'గంజాం జిల్లా వరదల్లో మునిగిపోతుంటే, బీజేపీ నాయకులు మాత్రం ఆనందంతో గెంతుతున్నారు' అని విమర్శించింది. అయితే బీజేపీ అధికార ప్రతినిధితో పాటు ఆ ఎమ్మెల్యే కూడా ఈ వీడియో క్లిప్‌పై స్పందించలేదు. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యే మనోరంజన్ ద్యాన్ సమంత్రా భార్య మీనా సాహు ఈ వీడియోపై స్పందించారు. వైరల్ అవుతున్న ఈ క్లిప్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి మార్ఫింగ్ చేశారని ఆమె ఆరోపించారు. అదే విలేకరుల సమావేశానికి సంబంధించిన మరో వీడియోను ఎక్స్‌లో షేర్ చేశారు. అదే అసలైన ఫుటేజ్ అని, మంత్రి ప్రసంగాన్ని ఎమ్మెల్యే చాలా శ్రద్ధగా వింటున్నారని ఆమె పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యే మనోరంజన్ ద్యాన్ సమంత్రా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఏఐ సాంకేతికతతో సృష్టించిన వీడియో క్లిప్‌ను బీజేడీకి చెందిన చికితీ సోషల్ మీడియా బృందం ప్రచారం చేస్తోందని ఆయన భార్య మీనా ఆరోపించారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బెర్హంపూర్ పోలీసులను ఆమె కోరారు.



70 మంది అమ్మాయిలకు వేధింపులు

బ్రిటన్‌లో భారతీయుడికి 30 ఏళ్ల జైలుశిక్ష



లండన్: ముంబైకి చెందిన 27 ఏళ్ల బిలాల్ ఖాజీ అనే వ్యక్తికి .. బ్రిటన్‌లో 30 ఏళ్ల జైలుశిక్ష పడింది. సుమారు 70 మంది అమ్మాయిలను అతను వేధించాడు. అమ్మాయిలకు చెందిన శృంగారభరిత వీడియోలు, ఇమేజ్‌లు అతని వద్ద ఉన్నాయి. 10 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న గర్ల్స్‌ను బిలాల్ టార్గెట్ చేశారు. స్నాప్‌చాట్, వింక్, రాబ్‌లాక్స్ లాంటి సోషల్ మీడియా, గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లను అతను వాడాడు. 2021 నుంచి 2025 మధ్య కాలంలో అతను అమ్మాయిలను వేధించినట్లు తెలుస్తోంది. కనీసం 20 ఏళ్లు అతను జైలు జీవితాన్ని అనుభవించాలి. ఆ తర్వాత అతను పెరోల్‌కు అర్హుడు అవుతాడు. కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేసేందుకు ఖాజీ బ్రిటన్ వెళ్లాడు. 37 అభియోగాలు నమోదు అయ్యాయి. చెస్టర్ క్రౌన్ కోర్టులో అతన్ని బంధించారు. అసభ్యకర చిత్రాలు పంపడం, బ్లాక్‌మెయిలింగ్ చేయడం, చిన్నారులను లైంగికంగా రెచ్చగొట్టినట్లు ఖాజీపై ఆరోపణలు ఉన్నాయి. ఓ బాధితురాలు 2021 డిసెంబర్‌లో డెర్బిషైర్ పోలీసుల్ని ఆశ్రయించడంతో ఖాళీ బాగోతం బయటపడింది. ఖాజీతో స్నాప్‌చాట్‌లో మాట్లాడేదాన్ని అని ఓ 13 ఏళ్ల అమ్మాయి ఫిర్యాదు చేసింది. అయితే నిందితుడు ఖాజీ తాను కూడా 14 ఏళ్ల వ్యక్తినే అని చెప్పుకుంటూ ఆ వయసున్న అమ్మాయిలను ట్రాప్ చేశాడు. పరిచయం కాగానే, సెక్సువల్ సంభాషణ చేయడం, ఆ తర్వాత అసంబద్ధమైన ప్రశ్నలు వేసి, అమ్మాయిలను బ్లాక్‌మెయిల్ చేసేవాడని తెలిసింది. అయితే తనకు షేరింగ్ చేసిన ఫోటోలు, వీడియోలను సర్క్యూలేట్ చేస్తానని బెదిరించేవాడని ఓ అమ్మాయి తన ఫిర్యాదులో చెప్పింది. ఖాజీ బాధితుల్లో 180 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతని వద్ద ఉన్న డివైస్ నుంచి కీలక సమాచారాన్ని రాబట్టారు. బాధితుల్లో 11 నుంచి 17 ఏళ్ల వయసున్న అమ్మాయిలు సుమారు 70 మంది ఉంటారని అధికారులు చెప్పారు.

నటుడు గిరిబాబు మృతిపై.. పవన్ సంతాపం!



దిగ్గజ నటుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన

తన నటనతో ప్రేక్షకులను అలరించిన గిరిబాబు

నిర్మాతగా, దర్శకుడిగా విజయవంతమైన చిత్రాలు

కుటుంబ సభ్యులకు ఉప ముఖ్యమంత్రి సానుభూతి

అమరావతి, నవంబర్ 14 (సమయం న్యూస్): ప్రముఖ నటుడు గిరిబాబు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గిరిబాబు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ప్రతినాయకుడు, కథానాయకుడు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రలు పోషించిన గిరిబాబు తన నటనతో పాటు హాస్యంతోనూ ప్రేక్షకులను ఎంతగానో అలరించారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. నిర్మాతగా, దర్శకుడిగా కూడా ఆయన ఎన్నో విజయవంతమైన చిత్రాలను రూపొందించారని గుర్తుచేశారు. గిరిబాబు కుమారుడు, నటుడు రఘుబాబుతో పాటు ఇతర కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిత్ర పరిశ్రమకు తీరని లోటు!

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూతపై మంత్రి దిగ్భ్రాంతి

గిరిబాబు కుటుంబ సభ్యులకు కందుల దుర్గేష్ సానుభూతి



అమరావతి, నవంబర్ 14 (సమయం న్యూస్): ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు మృతి పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా గిరిబాబు తెలుగు సినీ రంగానికి విశేష సేవలందించారని మంత్రి పేర్కొన్నారు. 600కు పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల హృదయాల్లో ఎప్పటికీ చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ప్రతినాయకుడు, హాస్యనటుడు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తనదైన సహజ నటనతో ఆయన మెప్పించారని గుర్తుచేశారు. గిరిబాబు మృతి తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిత్యావసరాలపై.. విజిలెన్స్ డేగకన్ను!

రాష్ట్రవ్యాప్తంగా ధరలు, నిల్వలపై విస్తృత తనిఖీలు

సీఎం ఆదేశాలతో బరిలోకి దిగిన 300 బృందాలు

రూ.10.43 కోట్ల విలువైన సరుకులు స్వాధీనం

అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసులు



విజయవాడ, నవంబర్ 14 (సమయం న్యూస్): నిత్యావసర వస్తువుల ధరలు, నిల్వలు, సరఫరాపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా పర్యవేక్షణలో ఈ తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అక్టోబర్ 26 నుంచి సుమారు 300 బృందాలు 250 మార్కెట్లు, పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాయి. దాదాపు 715 హోల్‌సేల్ వ్యాపార సంస్థలు, 17 రైస్ మిల్లులు, 13 గోదాములు, 145 రిటైల్ దుకాణాలను పరిశీలించి ఏకంగా 516 కేసులు నమోదు చేశారు. కృత్రిమ కొరత, అధిక ధరలు, అక్రమ నిల్వలకు సంబంధించి ఐదు ప్రత్యేక సందర్భాలను గుర్తించి, ఇప్పటివరకు సుమారు రూ.10.43 కోట్ల విలువైన నిత్యావసర సరుకులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 160 టన్నుల బియ్యం, 2018 మెట్రిక్ టన్నుల ధాన్యం, 830 కిలోల పప్పులు, 1930 లీటర్ల వంట నూనె, 9.3 మెట్రిక్ టన్నుల పసుపు తదితరాలు ఉన్నాయి. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయాలపై తమ నిఘా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని డీజీ హరీష్ కుమార్ గుప్తా గట్టిగా హెచ్చరించారు.



పుస్తక పఠనంతోనే ఉజ్వల భవిష్యత్తు!

ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం

- **జాతీయ జెండా ఆవిష్కరించిన చైర్‌పర్సన్ సుచిత్ర వీరయ్య చౌదరి**
- **బాలల దినోత్సవం సందర్భంగా ప్రధాని నెహ్రూకు నివాళులు**
- **గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందాలన్న వక్తలు**
- **ఉత్సాహంగా విద్యార్థుల చిత్రలేఖనం, పాటల పోటీలు**



ఒంగోలు, నవంబర్ 14 (సమయం న్యూస్): స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.



మొదటిరోజు కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి సభాధ్యక్షత వహించగా, డిప్యూటీ డీఈఓ టి. రవికుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా తొలుత చైర్‌పర్సన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సరస్వతి అమ్మవారి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల దినోత్సవం, దేశ తొలి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి మాట్లాడుతూ.. ఒక మంచి పుస్తకం వందమంది మంచి మిత్రులతో సమానమని పేర్కొన్నారు. పుస్తకం మనకు తెలియని కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుందని, చదివే అలవాటు ఉన్న ప్రతి ఒక్కరికీ గ్రంథాలయం ఒక నూతన అవకాశమని తెలిపారు. మనమందరం పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తూ, భావి భారత పౌరులైన పిల్లలకు గ్రంథాలయాలను పరిచయం చేసి వాటిని విజ్ఞాన కేంద్రాలుగా మరింత అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు.

ఒక పుస్తకం.. ప్రపంచాన్ని మార్చగలదు..

ముఖ్య అతిథి డిప్యూటీ డీఈఓ టి. రవికుమార్ మాట్లాడుతూ.. ఒక పుస్తకం, ఒక కలం, ఒక బిడ్డ, ఒక ఉపాధ్యాయుడు ఈ ప్రపంచాన్ని మార్చగలరని అన్నారు. విద్యార్థులు తమ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని, కేవలం చదవడం కోసం కాకుండా వ్యక్తిత్వ వికాసం కోసం మంచి పుస్తకాలను ఎంచుకోవాలని హితవు పలికారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థుల కోసం చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న 30 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది ఎం. శ్రీనివాసులు, కె. సంపూర్ణమ్మ, డి. సందీప్, ఎం. శివకుమారి, ఎస్. అనిల్ బాబు, కార్యాలయ సిబ్బంది జి. శాంసన్, కె. కృష్ణవేణి, వై. మృదుల్ కుమార్, స్కూల్ అసిస్టెంట్ దాసరి ప్రసాద్, సృష్టి అకాడమీ ప్రతినిధి టి. రవీంద్ర పాల్గొన్నారు.

లావణ్య లహరికి గోల్డ్ మెడల్!

- **కర్ణాటకలోని సూరత్కల్ ఎన్ఐటీలో ఎం.టెక్ ఉత్తమ ఫలితాలు**
- **సరోజినీ దేవి శ్రీధర్ అవార్డుతో లహరికి ఘన సత్కారం**
- **నెల్లూరు జిల్లా వాసికి జాతీయస్థాయిలో అరుదైన గౌరవం**
- **విద్యార్థినికి అభినందనలు తెలిపిన తోటి మిత్రులు, నిర్వాహకులు**



నెల్లూరు, నవంబర్ 14 (సమయం న్యూస్): కర్ణాటకలోని ప్రముఖ విద్యాసంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) సూరత్కల్ యూనివర్సిటీలో ఎం.టెక్ చదువుతున్న ఎన్. లావణ్య లహరి అత్యుత్తమ ఫలితాలు సాధించి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. సంస్థ తరఫున గోల్డ్ మెడల్‌తో పాటు 'శ్రీమతి సరోజినీ దేవి – కేఈ శ్రీధర్' ప్రతిష్టాత్మక అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించారు. ఎం.టెక్‌లో అత్యుత్తమ శ్రేణి ఫలితాలు సాధించినందుకు ఈ అవార్డును లహరికి అందజేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. నెల్లూరులోని ధనలక్ష్మిపురం వీబీఆర్ హైస్కూల్‌లో పదో తరగతి, నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసిన లావణ్య లహరి మొదటినుంచీ చదువులో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ వస్తోంది. నెల్లూరు జిల్లా వాసి అయిన ఆమె ఇప్పుడు సూరత్కల్ ఎన్ఐటీలో ఏకంగా గోల్డ్ మెడల్ అందుకోవడం పట్ల నెల్లూరీయులు, అభిమానులు సర్వత్రా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న లహరికి తోటి విద్యార్థులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, అభిమానులు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యానికి.. పోషకాహార తోటలు!

- **విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవాలి**
- **చైల్డ్ న్యూట్రి గార్డెన్ ఫెస్టివల్‌లో ఎం. నాయక్**
- **పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటిన కార్యదర్శి**
- **నెట్ జీరో లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరి పిలుపు**



నందిగామ, నవంబర్ 14 (సమయం న్యూస్): చిన్న వయస్సు నుంచే విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని ప్రభుత్వ కార్యదర్శి ముదావత్ ఎం. నాయక్ సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నందిగామ మండలం ముప్పాళ్లలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకులంలో నిర్వహించిన చైల్డ్ న్యూట్రి గార్డెన్ ఫెస్టివల్లో ఆయన పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో విత్తనాలు, మొక్కలు నాటి పోషకాహార తోటను ప్రారంభించారు. విద్యార్థులు స్వయంగా కూరగాయలు, ఆకుకూరలు పెంచడం ద్వారా తాజా, పోషక విలువలున్న ఆహారం పొందవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించడం లాంటి అలవాట్లను విధిగా పాటించాలని సూచించారు. నెట్ జీరో లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, విద్యార్థులు పర్యావరణహిత జీవన విధానాన్ని అలవరచుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి ఎన్. తేజ్‌భరత్, అదనపు కార్యదర్శి పద్మావతి, నెట్ జీరో ఎస్‌పీడీ శరవణన్, కృష్ణా జిల్లా డీసీవో టి. మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



అయోధ్యకు.. కొత్త రైలు!

జనకపూర్ ధామ్ నుంచి అయోధ్య కాంట్ వరకు సేవలు

వారానికి ఒకసారి రైలు నడిపేందుకు రైల్వే ఆమోదం

604 కిలోమీటర్లు ప్రయాణించనున్న పవిత్ర రైలు

పర్యాటకం, వాణిజ్యం, స్థానిక ఉపాధికి భారీ ప్రయోజనం

న్యూఢిల్లీ, నవంబర్ 14 (సమయం న్యూస్): భారత్, నేపాల్ మధ్య రైల్వే కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే దిశగా నేపాల్‌లోని జనకపూర్ ధామ్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య కాంట్ వరకు సరికొత్త వారపు రైలు సేవను ప్రారంభించేందుకు భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది. సుమారు 604 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ రైలు జయనగర్, మధుబని, సీతామఢి, రక్సౌల్, నర్కటియాగంజ్, గోరఖ్‌పూర్, బస్తీ, మనకాపూర్, అయోధ్య ధామ్ తదితర స్టేషన్లలో ఆగుతుంది. జనకపూర్ ధామ్ నుంచి ప్రతి శనివారం, అయోధ్య కాంట్ నుంచి ప్రతి సోమవారం ఈ రైలు బయలుదేరుతుంది. సీతాదేవి జన్మస్థలంగా జనకపూర్ ధామ్, శ్రీరాముడి జన్మస్థలంగా అయోధ్యకు ఉన్న ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని నడుపుతున్న ఈ రైలు సేవ భక్తులు, పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రామాయణ పర్యాటక సర్క్యూట్ అభివృద్ధితో పాటు పర్యాటకం, వాణిజ్యం, స్థానిక ఉపాధి, హోటళ్లు, వ్యాపారాలు, సంప్రదాయ కళాకారులకు ఈ రైలు సేవ ద్వారా భారీ ప్రయోజనం కలగనుంది. భారత్, నేపాల్ మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక, సామాజిక సంబంధాలను మరింత బలోపేతం చేసే కీలక చర్యగా ఈ రైలు సేవ నిలవనుంది.

విదేశీ పార్సిల్‌లో.. డ్రగ్స్!

యూరప్ నుంచి వచ్చిన పోస్టల్ పార్సిల్‌లో గులాబీ రంగు పొడి

10.8 కిలోల యాంఫెటమైన్ స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ

బట్టల ముసుగులో అక్రమ రవాణాకు కేటుగాళ్ల యత్నం

ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం ఎనిమిది ప్యాకెట్లు సీజ్

డ్రగ్ సిండికేట్ నెట్‌వర్క్‌పై ముమ్మర దర్యాప్తు



న్యూఢిల్లీ, నవంబర్ 14 (సమయం న్యూస్): యూరప్ నుంచి పోస్టల్ పార్సిల్ ద్వారా భారత్‌లోకి అక్రమంగా తరలిస్తున్న 10.8 కిలోల యాంఫెటమైన్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు వలపన్ని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో న్యూఢిల్లీలోని ఫారిన్ పోస్ట్ ఆఫీస్‌కు చేరిన అనుమానాస్పద పార్సిల్‌ను అధికారులు తనిఖీ చేశారు. ఆ పార్సిల్‌లో దుస్తులు ఉన్నట్లు ప్రకటించినప్పటికీ, కార్టన్ ప్యాకింగ్‌లో ప్రత్యేకంగా దాచిన ఎనిమిది ప్యాకెట్లలో గులాబీ రంగు పొడి గుర్తించారు. ల్యాబ్ పరీక్షల్లో అది యాంఫెటమైన్‌గా నిర్ధారణ అయింది. ఆ ఎనిమిది ప్యాకెట్లను ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం స్వాధీనం చేసుకుని అధికారులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న అంతర్జాతీయ డ్రగ్ సిండికేట్ నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు అధికారులు తమ దర్యాప్తు ముమ్మరం చేశారు. చట్టబద్ధమైన పోస్టల్, వాణిజ్య మార్గాలను దుర్వినియోగం చేస్తూ సాగుతున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు డీఆర్ఐ తమ నిఘాను మరింత కట్టుదిట్టం చేసింది.



మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం!

- **ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో పట్టణంలో విస్తృత తనిఖీలు**
- **వాహనాలు, అనుమానాస్పద వ్యక్తులపై పోలీసుల ఆకస్మిక సోదాలు**
- **విద్యాసంస్థల వద్ద విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం**
- **గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల వివరణ**
- **సమాచారం ఇస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామన్న సిబ్బంది**

ఒంగోలు, నవంబర్ 14 (సమయం న్యూస్): ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా శనివారం ఒంగోలు పట్టణంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జ్ సీఐ కమలాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ చెంచయ్య, ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా, ఈగల్ టీం సిబ్బంది సంయుక్తంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లు, వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు, ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువత వ్యసనాలకు దూరం కావాలి..

అనంతరం విద్యాసంస్థల వద్ద విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, మానసిక దుష్పరిణామాలను వారు విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, కేవలం విద్యపైనే దృష్టి సారించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు లేదా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా ఈగల్ బృందానికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను కచ్చితంగా గోప్యంగా ఉంచుతామని సిబ్బంది స్పష్టం చేశారు.

ఎన్నికల కోడ్.. పక్కాగా పాటించాల్సిందే!

- **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**
- **ముందస్తు అనుమతితోనే సభలు, సమావేశాలు**
- **ప్రచారాల్లో లౌడ్ స్పీకర్లపై పోలీసుల ఆంక్షలు**
- **ఓటర్లను ప్రలోభపెడితే ఉపేక్షించేది లేదు**
- **కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వార్నింగ్**



తాడిగడప, నవంబర్ 14 (సమయం న్యూస్): తాడిగడప, గుడివాడ మున్సిపాలిటీలతో పాటు మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సూచించారు. పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలు, సభలు, సమావేశాలకు ముందస్తుగా పోలీస్, రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా లౌడ్‌స్పీకర్లు, సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదన్నారు. ఓటర్లను డబ్బు, మద్యం, ఇతర వస్తువులతో ప్రలోభపెట్టడం, కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రచారం చేయడం, ఇతర అభ్యర్థుల ప్రచార సామగ్రిని ధ్వంసం చేయడం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు ముగ్గురికి మించి రావద్దని సూచించారు. ఊరేగింపుల సమయం, మార్గం, ప్రారంభం, ముగింపు ప్రదేశాలను ముందుగానే నిర్ణయించి పోలీసుల అనుమతి పొందాలని తెలిపారు. వివిధ పార్టీల ఊరేగింపులు పరస్పరం ఎదురుపడకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, నిబంధనల ఉల్లంఘనలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

డేటా భద్రతకు ఆన్‌లైన్ పోర్టల్!

- **కన్సెంట్ మేనేజర్ల రిజిస్ట్రేషన్ కోసం నూతన విధానం**
- **వెబ్‌సైట్‌ను ప్రారంభించిన కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి**
- **వ్యక్తిగత డేటాకు సంబంధించిన అనుమతుల నిర్వహణ సులభతరం**
- **అర్హత కలిగిన సంస్థలకు రిజిస్ట్రేషన్ మంజూరు చేయనున్న బోర్డు**



న్యూఢిల్లీ, నవంబర్ 14 (సమయం న్యూస్): డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ (డీపీడీపీ) చట్టంలో భాగంగా కన్సెంట్ మేనేజర్ల రిజిస్ట్రేషన్ ఫ్రేమ్‌వర్క్ నవంబర్ 13 నుంచి అమల్లోకి వచ్చింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మెయిటీ) మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించారు. భారతదేశంలో నమోదైన అర్హత కలిగిన కంపెనీలు ప్రభుత్వ పోర్టల్ ద్వారా కన్సెంట్ మేనేజర్లుగా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు సదరు కంపెనీ కనీస నికర విలువ రూ.2 కోట్లు ఉండటంతో పాటు సాంకేతిక, ఆర్థిక, నిర్వహణ సామర్థ్యాలు కూడా తప్పనిసరిగా కలిగి ఉండాలి. కన్సెంట్ మేనేజర్ ద్వారా వ్యక్తులు తమ వ్యక్తిగత డేటాకు సంబంధించిన అనుమతులను ఇవ్వడం, నిర్వహించడం, సమీక్షించడం, ఉపసంహరించుకోవడం లాంటి చర్యలను చాలా సులభంగా చేపట్టవచ్చు. ఈ వ్యవస్థ డిజిటల్ రంగంలో పారదర్శకత, భద్రత, జవాబుదారీతనాన్ని పెంచే లక్ష్యంతో రూపుదిద్దుకుంది. అర్హత కలిగిన కంపెనీల దరఖాస్తులను డేటా ప్రొటెక్షన్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిశితంగా పరిశీలించి అర్హత సాధించిన సంస్థలకు రిజిస్ట్రేషన్ మంజూరు చేస్తుంది. నమోదైన కన్సెంట్ మేనేజర్ల జాబితాను బోర్డు వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు. డీపీడీపీ చట్టంలోని డేటా ప్రిన్సిపల్స్ హక్కులు, డేటా ఫిడ్యూషరీల బాధ్యతలు, బోర్డు విచారణలు, జరిమానాలకు సంబంధించిన ఇతర కీలక నిబంధనలు 2027 మే 13 నుంచి అమల్లోకి రానున్నాయి.

చివరి బంతి వరకు ఉత్కంఠ

- పాక్‌పై భారత్ సంచలన విజయం!
- ఒక్క వికెట్ తేడాతో యువ భారత్
- ఫోర్‌తో గెలిపించిన మోహిత్ ఉల్వా
- 338 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా







మస్కట్ (ఒమన్), నవంబర్ 14 (సమయం న్యూస్): చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన అండర్-19 ఆసియా కప్ 2026 ఫైనల్ పోరు అభిమానులకు అసలైన క్రికెట్ మజాను పంచింది. చివరి ఓవర్ చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుంది. పాకిస్తాన్ నిర్దేశించిన 340 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ 49.6 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో ఒక్క వికెట్ తేడాతో గెలిచి అండర్-19 ఆసియా కప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. టాస్ గెలిచిన పాకిస్తాన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. ఆ జట్టు బ్యాటర్లలో ఉస్మాన్ ఖాన్ అద్భుత సెంచరీతో చెలరేగాడు. 111 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 107 పరుగులు చేశాడు. అబ్దుల్ ఖాదిర్ 54 బంతుల్లో 80 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ ఫర్హాన్ యూసఫ్ 60బంతుల్లో 63 పరుగులు చేసి కీలక భాగస్వామ్యం అందించాడు. దీంతో పాకిస్తాన్ భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో కావ్య పటేల్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. చిరుగుపాటి వెంకట మూడు వికెట్లతో రాణించాడు. చివరి ఓవర్లలో భారత బౌలర్లు కట్టడి చేయడంతో పాకిస్తాన్ స్కోరు 340 పరుగుల లోపే నిలిచింది.

నిలకడగా ఆడిన భారత్

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు ఆర్య వీర్ సెహ్వాగ్, కెప్టెన్ లక్ష్య రాజేశ్ రాయచందన్ మంచి ఆరంభాన్ని అందించారు. ఇద్దరూ తొలి వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆర్యవీర్ సెహ్వాగ్ 61 బంతుల్లో 58 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం లక్ష్య రాజేశ్ రాయచందన్ 101బంతుల్లో 80 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అయితే ఆర్యవీర్ ఔటైన తర్వాత వికెట్లు వరుసగా పడిపోయాయి. వీకే వినీత్ 24, అర్జున్ రాజ్‌పుత్ 16, యశ్‌బర్ధన్ చౌహాన్ 9 పరుగులు చేశారు. కెప్టెన్ లక్ష్యతో పాటు అన్వయ్ ద్రవిడ్ కూడా పెవిలియన్‌కు చేరడంతో భారత్ కష్టాల్లో పడింది. ఒక దశలో భారత్ 251 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. లక్ష్యం ఇంకా దూరంలో ఉండగా వికెట్లు వరుసగా పడటంతో పాకిస్తాన్ విజయం ఖాయమనిపించింది. ఈ సమయంలో మానల్ చౌహాన్, మొహిత్ ఉల్వా అద్భుత పోరాటం చేశారు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. మానల్ చౌహాన్ 32 బంతుల్లో 47 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అతడి ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లు ఉన్నాయి. మొహిత్ ఉల్వా మరింత దూకుడుగా ఆడాడు. కేవలం 22 బంతుల్లో 43 పరుగులు చేసి భారత విజయంపై ఆశలు రేకెత్తించాడు. అతడి ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లు ఉన్నాయి. మానల్ ఔటైనా మొహిత్ పోరాటం ఆపలేదు. చిగురుపాటి వెంకటతో కలిసి జట్టును విజయానికి చేరువ చేశాడు. చివరి ఓవర్‌లో భారత్ విజయానికి 8 పరుగులు అవసరమయ్యాయి. పాకిస్తాన్ తరఫున అహ్మద్ హుస్సేన్ బంతిని అందుకున్నాడు. మరోవైపు మొహిత్ ఉల్వా, చిగురుపాటి వెంకట క్రీజులో ఉన్నారు. తొలి బంతికి మొహిత్ పరుగులేమీ చేయలేదు. రెండో బంతికి సింగిల్ తీశాడు. మూడో బంతికి వెంకట ఒక పరుగు సాధించడంతో భారత్ విజయానికి ఐదు పరుగుల దూరంలో నిలిచింది. నాలుగో బంతికి మొహిత్ మరో పరుగు తీశాడు. ఐదో బంతికి వెంకట సింగిల్ తీసుకోవడంతో స్కోరు సమం కావడానికి అవసరమైన పరిస్థితి ఏర్పడింది. చివరి బంతికి మొహిత్ ఉల్వా ఫోర్ బాదడంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. 9 వికెట్లు కోల్పోయినప్పటికీ అద్భుత పోరాటంతో భారత్ ఒక్క వికెట్ తేడాతో విజయాన్ని అందుకుంది.



15 ఏళ్లకే కెప్టెన్‌గా ప్రపంచ రికార్డు..

వైభవ్ సూర్యవంశీ అరుదైన ఘనత

భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరో అరుదైన రికార్డు సృష్టించాడు. పురుషుల టీ20 క్రికెట్ చరిత్రలో అత్యంత పిన్న వయసులో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన ఆటగాడిగా నిలిచాడు. 15 ఏళ్ల 232 రోజుల వయసులో శనివారం ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో సౌరాష్ట్రతో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్‌లో బిహార్ జట్టుకు నాయకత్వం వహించాడు. సొంత రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం రావడం ఆనందంగా ఉందని వైభవ్ తెలిపాడు. గతంలో దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన అతడు.. ఇషాన్ కిషన్ గాయపడిన సమయంలో జట్టును నడిపించాడు. ప్రస్తుతం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడి, అనంతరం ఎమర్జింగ్ ఆసియా కప్‌లో భారత జట్టుతో చేరనున్నాడు. గత ఏడాది అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 175 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన వైభవ్.. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును అందుకున్నాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 237.30 స్ట్రైక్‌రేట్‌తో 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్నాడు. జూలైలో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అంతర్జాతీయ టీ20 అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు ప్రొఫెషనల్ టీ20ల్లో 44 మ్యాచ్‌లు ఆడిన వైభవ్.. బిహార్ తరఫున గతంలోనూ ఆకట్టుకున్నాడు. మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో 61 బంతుల్లో అజేయంగా 108 పరుగులు సాధించాడు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ యువ సంచలనం భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సృష్టిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.

పరుగుల వీరుడికి 'సున్నా' షాక్



- సచిన్‌తో సమంగా కోహ్లీ!
- వన్డేల్లో అత్యధిక డకౌట్ల భారత ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానం

మౌంట్ మౌంగనుయ్, నవంబర్ 14 (సమయం న్యూస్): టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఖాతాలో ఓ అవాంఛిత (చెత్త) రికార్డు చేరింది. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో అత్యధికసార్లు పరుగులేమీ చేయకుండా (డకౌట్) వెనుదిరిగిన భారత ఆటగాళ్ల జాబితాలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో కలిసి కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. న్యూజిలాండ్‌తో శుక్రవారం మౌంట్ మౌంగనుయ్‌లోని బే ఓవల్ వేదికగా జరిగిన నాలుగో వన్డేలో నాలుగు బంతులు ఎదుర్కొన్న కోహ్లీ, ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరడంతో ఈ చెత్త రికార్డు నమోదైంది. వన్డే క్రికెట్ చరిత్రలో సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ ఇద్దరూ తమ కెరీర్‌లో ఇప్పటివరకు చెరో 20 సార్లు డకౌట్ అయ్యారు. అయితే క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ తన సుదీర్ఘ కెరీర్‌లో 463 వన్డే మ్యాచ్‌లు ఆడి 20 సార్లు సున్నా చుట్టగా, విరాట్ కోహ్లీ కేవలం 321 మ్యాచ్‌ల్లోనే ఆ సంఖ్యను సమం చేయడం గమనార్హం. ఈ జాబితాలో భారత మాజీ పేసర్ జవగల్ శ్రీనాథ్ 229 మ్యాచ్‌ల్లో 19 డకౌట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత ఆటగాళ్ల జాబితాలో మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే (295 మ్యాచ్‌లు), కెప్టెన్ రోహిత్ శర్మ (269 మ్యాచ్‌లు), మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ (301 మ్యాచ్‌లు) తలో 18 డకౌట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. ఇక ఓవరాల్‌గా అంతర్జాతీయ వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక డకౌట్ల రికార్డు శ్రీలంక మాజీ దిగ్గజ ఓపెనర్ సనత్ జయసూర్య పేరిట ఉంది. ఆయన తన వన్డే కెరీర్‌లో 433 ఇన్నింగ్స్‌లు ఆడి ఏకంగా 34 సార్లు పరుగులేమీ చేయకుండానే వెనుదిరిగాడు.

వాటా విక్రయానికి మెహతా గ్రూప్ కసరత్తు!

- కేకేఆర్‌లోకి అమెరికా దిగ్గజం?..
- ఒప్పందంపై ఇంకా వెలువడని అధికారిక ప్రకటన



కోల్‌కతా, నవంబర్ 14 (సమయం న్యూస్): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మరో భారీ పెట్టుబడి ఒప్పందానికి రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మూడుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంచైజీలోకి అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడి సంస్థ ఏరెస్ మేనేజ్‌మెంట్ ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేకేఆర్‌లో మైనారిటీ వాటాను కొనుగోలు చేసేందుకు ఆ సంస్థ ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఈ మేరకు ఫ్రాంచైజీ యాజమాన్యంతో చర్చలు జరుగుతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం కేకేఆర్ యాజమాన్యం నైట్‌రైడర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేతుల్లో ఉంది. ఇందులో బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్‌కు చెందిన రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు 55 శాతం, నటి జూహీ చావ్లా, పారిశ్రామికవేత్త జే మెహతాకు చెందిన మెహతా గ్రూప్‌కు 45 శాతం వాటా ఉంది. తాజా సమాచారం ప్రకారం మెహతా గ్రూప్ తన వాటాలో సుమారు 20 శాతం విక్రయించే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ చర్చల్లో కేకేఆర్ మొత్తం విలువను 180 కోట్ల అమెరికన్ డాలర్లుగా అంచనా వేసినట్లు తెలుస్తోంది. ఏరెస్ మేనేజ్‌మెంట్‌తో ఒప్పందం కుదిరితే మెహతా గ్రూప్ వాటాలో కొంత భాగం కొత్త పెట్టుబడిదారుడి చేతికి వెళ్లనుంది. షారుఖ్ ఖాన్‌కు చెందిన రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ వాటాలో మాత్రం మార్పు ఉండకపోవచ్చని సమాచారం. అయితే విక్రయించే వాటా పరిమాణం, పెట్టుబడి మొత్తం, ఒప్పంద నిబంధనలపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవలి కాలంలో ఐపీఎల్ ఫ్రాంచైజీలపై అంతర్జాతీయ పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతోంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ యాజమాన్య వాటాలకు సంబంధించిన పరిణామాల నేపథ్యంలో కేకేఆర్ వ్యవహారం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఏరెస్ మేనేజ్‌మెంట్ పెట్టుబడులు పెడుతుందా, మెహతా గ్రూప్ ఎంత వాటా విక్రయిస్తుందనే అంశాలపై అధికారిక ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంది.



అర్జున అందుకున్న ధనుష్ శ్రీకాంత్

న్యూఢిల్లీ: తెలంగాణ షూటర్ ధనుష్ శ్రీకాంత్ ప్రతిష్టాత్మక క్రీడా పురస్కారం అర్జున అవార్డు అందుకున్నాడు. రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2026 జాతీయ క్రీడా పురస్కారాలను విజేతలకు ప్రదానం చేశారు. శ్రీకాంత్ (డెఫ్ షూటింగ్) సహా మొత్తం 17 మంది క్రీడాకారులు ప్రతిష్టాత్మక అర్జున అవార్డులకు ఎంపికయ్యారు. 2014 తర్వాత తొలిసారిగా మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న పురస్కారం ఎవరికీ ప్రకటించకుండానే ఈ వేడుకను నిర్వహించడం గమనార్హం. అర్జున అవార్డు అందుకున్న వారిలో తేజస్విన్ శంకర్ (అథ్లెటిక్స్), దివ్య దేశ్‌ముఖ్, విదిత్ గుజరాతీ (చెస్), ట్రీసా జాలీ (బ్యాడ్మింటన్), నరేందర్ (బాక్సింగ్) తదితరులు ఉన్నారు.



అతను నా లక్కీ చార్మ్: మృణాల్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ తన కెరీర్‌లో ప్రత్యేక పాత్ర పోషించారని నటి మృణాల్ ఠాకూర్ వెల్లడించారు. ప్రస్తుతం నటిగా తాను ఈ స్థాయికి చేరుకోవడానికి ఆయన కూడా ఒక కారణమని చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు. రణ్‌వీర్‌ను తన లక్కీ చార్మ్‌గా అభివర్ణించారు. కెరీర్ ఆరంభంలో రణ్‌వీర్ సింగ్‌తో కలిసి ఓ హెయిర్ బ్రాండ్ వాణిజ్య ప్రకటనలో నటించిన విషయాన్ని మృణాల్ గుర్తుచేసుకున్నారు. ఆ యాడ్ ద్వారా తనకు మంచి గుర్తింపు లభించిందని, అనంతరం సినీ నిర్మాతలు తనను గుర్తించి అవకాశాలు ఇవ్వడం మొదలుపెట్టారని తెలిపారు. రణ్‌వీర్ వ్యక్తిత్వం, పని పట్ల ఆయన చూపించే అంకితభావాన్ని మృణాల్ ప్రశంసించారు. ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ఉండే ఆయన.. ప్రతి పాత్ర కోసం ఎంతో కష్టపడతారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన సాధిస్తున్న విజయాల వెనుక కఠోర శ్రమ, పట్టుదల ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల విడుదలైన 'ధురంధర్ 2'లో రణ్‌వీర్ నటన తనను ఎంతగానో ఆకట్టుకుందని మృణాల్ అన్నారు. సినిమా చూస్తున్నంతసేపు రణ్‌వీర్ కనిపించలేదని, కేవలం హమ్జా పాత్ర మాత్రమే కనిపించిందని కొనియాడారు. ఆ పాత్రలో పూర్తిగా లీనమై నటించి తన అద్భుతమైన నటనా ప్రతిభను మరోసారి నిరూపించుకున్నారని ప్రశంసించారు.

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత



తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది. సీనియర్ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. కొంతకాలంగా వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో సినీ ప్రముఖులు, అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. 1943 జూన్ 8న ప్రకాశం జిల్లాలో జన్మించిన గిరిబాబు.. సినిమాలపై ఆసక్తితో చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించారు. 1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో ప్రతినాయకుడిగా తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. విలక్షణమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ అంచెలంచెలుగా గుర్తింపు సంపాదించారు. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా గిరిబాబు తన ప్రతిభను చాటుకున్నారు. సుమారు ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలో 600కు పైగా చిత్రాల్లో నటించారు. ప్రతినాయకుడిగా భయపెట్టిన ఆయన.. హాస్యనటుడిగా నవ్వులు పంచారు. తండ్రి, తాత పాత్రల్లోనూ తనదైన నటనతో ప్రేక్షకులకు చేరువయ్యారు. దశాబ్దాల పాటు తెలుగు చిత్రసీమలో విభిన్న పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గిరిబాబు మరణం టాలీవుడ్‌కు తీరని లోటు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పిస్తున్నారు.

స్టైలిష్ లుక్‌లో అవ్నీత్ కౌర్



బుల్లితెర నటీమణులు కూడా వెండితెర హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోరని నిరూపిస్తున్న వారిలో అవ్నీత్ కౌర్ ఒకరు. తాజాగా ఆమె పంచుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో ఆకట్టుకుంటున్నాయి. నలుపు, వెండి రంగుల చారలతో కూడిన స్ట్రాప్‌లెస్ టాప్, ఫ్రిల్స్‌తో కూడిన బ్లాక్ మినీ స్కర్ట్‌లో అవ్నీత్ మెరిశారు. సిల్వర్ ఫ్లీట్స్, చైన్ బెల్ట్, స్టార్ డిజైన్‌తో కూడిన హీల్స్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బ్లూ నెయిల్స్, లైట్ మేకప్, వదులుగా వదిలిన ఉంగరాల జుట్టుతో స్టైలిష్‌గా కనిపించారు. ప్రస్తుతం టీవీ సీరియళ్లకు దూరంగా ఉంటున్న అవ్నీత్.. సినిమాలు, వెబ్ సిరీస్‌లపై దృష్టి పెట్టారు. త్వరలో విడుదల కానున్న 'గన్‌మాస్టర్ జీ9' చిత్రంలో ఆమె భాగమయ్యారు.

ఆ ఘటన ఇప్పటికీ నన్ను వెంటాడుతోంది

'ఇండియన్ 2' సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఘోర ప్రమాదం తనను ఇప్పటికీ భయపెడుతోందని హీరోయిన్ కాజల్ అగర్వాల్ వెల్లడించారు. ఆ ప్రమాదంలో తాను కూడా ప్రాణాలు కోల్పోయి ఉండేదాన్నని, అదృష్టవశాత్తూ బయటపడ్డానని గుర్తుచేసుకున్నారు. 2020 ఫిబ్రవరిలో చెన్నైలోని ఈవీపీ ఫిల్మ్ సిటీలో కమల్ హాసన్ హీరోగా, శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇండియన్ 2' షూటింగ్ సమయంలో భారీ క్రేన్ కూలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. ప్రమాద సమయంలో తాను మానిటర్ సమీపంలో కూర్చున్నానని, క్రేన్ తనవైపు దూసుకొస్తుండగా ఎవరో వెనక్కి లాగి కాపాడారని కాజల్ తెలిపారు. తనను కాపాడిన వ్యక్తి ఎవరో ఇప్పటికీ తెలియదని, ఆ భయానక ఘటనను తలుచుకుంటే ఇప్పటికీ వణుకు పుడుతోందని చెప్పారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**